క్లుప్తంగా

మిస్సింగ్ కేసు నమోదు



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉనికిచర్ల గ్రామానికి చెందిన కందుకూరి సుమలత 15 రోజుల క్రితం గ్యాస్ ఈ–కేవైసీ చేపిస్తానని ఇంట్లో చెప్పి తన చిన్న కూతురు శ్రీజతో కలిసి రూ.50 వేలు తీసుకొని ధర్మసాగర్‌కు వెళ్ళింది. ఇంటికి రాక పోవడంతో బంధువులు, పరిచయస్తులను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో సుమలత భర్త రాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సుమలత ఇంట్లో నుంచి వెళ్లే సమయంతో ఆస్మాన్ కలర్ పువ్వులతో ఉన్న తెల్లచీర, నల్లజాకెట్‌తో ఉందని, కనిపిస్తే డయల్ 100కి, లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ ఎన్నిక



తాగూర్ రామ్‌సింగ్



వీరస్వామి

ఎల్కతుర్తి : మండలంలోని దామెర సమ్మక్క–సారలమ్మ జాతర నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా తాగూర్ రామ్ సింగ్, వైస్ చైర్మన్లుగా గొర్రె చుక్క కొమురయ్య, చల్లా దయాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా చల్లా రమణారెడ్డి, సభ్యులుగా చల్లా రవీందర్‌రెడ్డి, గొర్రె ఆదామ్, వేముల రజిని–వెంకన్న, ఎండీ కమురొద్దీన్ ఎన్నికయ్యారు. అలాగే భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మాదుగుల వీరస్వామి, సభ్యులుగా సదానందంగౌడ్, వెంకటేశ్వర్లు, పలువురు సభ్యులు ఎన్నికయ్యారు.

వంశీధర్‌రావుకు యూత్‌ఐకాన్ అవార్డు



కమలాపూర్ : పినాకి మీడియా 8వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో కమలాపూర్ మండలంలోని గుండేడుకు చెందిన విష్ణుదాసు వంశీధర్‌రావుకు యూత్‌ఐకాన్ అవార్డు లభించింది. పినాకి మీడియా వ్యవస్థాపకుడు వంశీ శాస్త్రి, రుద్రవీణ బాలసుబ్రహ్మణ్యం, ఆకెళ్ల రాఘవేంద్రరావు, మోటివేషన్ స్పీకర్ శశిధర్ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సామాజిక, రాజకీయ, బ్రాహ్మణ సేవా రంగాల్లో వంశీధర్‌రావు చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు అవార్డు అందజేసినట్లు పినాకి మీడియా ప్రతినిధులు తెలిపారు. వంశీధర్‌రావుకు యూత్‌ఐకాన్ అవార్డు రావడంతో బ్రాహ్మణ సేవాసంఘం మండల నాయకులు అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, హర్షం వ్యక్తం చేశారు.

సంజీవకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు బొల్లారం సంజీవకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంపాక్ట్ ఆఫ్ టూరిజం ఆన్ సోషియా – ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఇన్ ఇండియా – ఏ స్టడీ ఆఫ్ నార్త్ తెలంగాణ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సంజీవకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ దయాకర్ రావు పర్యవేక్షణలో సంజీవ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

బయో టెక్నాలజీలో సునీతాబాయికి..



హన్మకొండ: హనుమకొండ కొత్తూరు జెండాకు చెందిన దారావత్ సునీతాబాయికి కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఫైటో కెమికల్ స్క్రీనింగ్, ఫార్మా స్యూటికల్ స్టడీస్ అండ్ సింథసిస్ ఆఫ్ సిల్వర్ నానో పార్టికల్స్ ఫ్రమ్ నోథపోడైట్స్ ఫోటిడా అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ తాడూరి శాస్త్రి పర్యవేక్షణలో ఆమె తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

11న పాటల పోటీలు

నయీంనగర్: అమర గాయకుడు ఘంటశాల 50 వర్ధంతి సందర్భంగా ఈనెల 11న హనుమకొండ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో పాటల పోటీలు నిర్వహించనున్నట్లు కాకతీయ మ్యూజికల్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు.

'పారిశుద్ధ్యం' పై ప్రత్యేక దృష్టి సారించాలి

- గ్రామపంచాయతీల్లో కలియదిరిగిన స్పెషలాఫీసర్లు
- సిబ్బందితో సమావేశం.. సూచనలు జారీ



దామెర : పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీఓ కేవీ రంగాచారి, తదితరులు

దామెర : గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీఓ కే.వి. రంగాచారి సూచించారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అంతర్గత రహదారులకు ఇరువైపులా చెత్తాచెదారం, మురుగునీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని జీపీ సిబ్బందికి సూచించారు. తాగునీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, కారోబార్ మాదారపు బొబ్బిలి, నాయకులు దుర్శెట్టి భిక్షపతి, కొమ్మాలు, లింగయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల వీఓఏలు ఉన్నారు.

ఆత్మకూరు : గ్రామాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్తులు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని కోరారు. నీటి పైపులు లీకేజీలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మేడ యాదగిరి, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు పాల్గొన్నారు.



వేలేరు : పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ



ధర్మసాగర్ : సూచనలు చేస్తున్న కార్యదర్శి

ధర్మసాగర్ : గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి మహేష్ అన్నారు. మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని వాణిజ్య, వ్యాపారులు తగ్గించి ప్రకృతిని కాపాడాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి చెత్తా, చెదారాన్ని కుండీల్లో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కారోబార్ మహేందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలేరు : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీపీ సమ్మిరెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లసాగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభ, ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు శుభ్రం చేయాలని, పిచ్చిమొక్కలను తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి సూర్యప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న నన్నెబోయిన తిరుపతి

ఐనవోలు : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి అన్నారు. ప్రత్యేక విద్యకమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని కక్కిరాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం టీపీటీఎఫ్ విద్యమహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్ర విద్యా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలన్నారు. ప్రభుత్వ బడులు బలోపేతం కావాలంటే ప్రభుత్వం చొరవ తీసుకుని అంతరాలులేని విద్యా విధానాన్ని తీసుకురావాలని అన్నారు. మహాసభలకు ముఖ్యఅతిథులుగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క హాజరవుతారని తెలిపారు. వక్తలుగా ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరామ్, చింతకింది కాశీం, బుర్ర రమేష్, నర్సింహరెడ్డి, వేణుగోపాల్, ప్రసాద్ హాజరవుతారని వెల్లడించారు. టీపీటీఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బీమళ్ల సారయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, కుమారస్వామి, హెచ్ఎం రామకృష్ణ, రవికుమార్, శ్రీనివాసరాజు, వెంకటయ్య, రవీందర్, ఆనందం, కుమారస్వామి, సురేఖ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలి

- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

ఎల్కతుర్తి : రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధిక సీట్లు గెలిచి సత్తాచాటాలని, అందుకు అనుగుణంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ సూచించారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో అధిక సీట్లు గెలిచేందుకు పార్టీ అధిష్ఠానం దృష్టి పెట్టిందన్నారు. కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. అలాగే హనుమకొండ, సిద్దిపేటతో పాటు వివిధ ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బస్సుల సంఖ్య పెంచాలని రోడ్డు రావాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిని కోరుతున్నామని అన్నారు. అలాగే ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, గౌరవెల్లి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి రైతులకు సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ఎంపీపీ అనీతరమేష్, జెడ్పీటీసీ రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్లు

పరకాల : రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఆనంద్‌కుమార్‌కు కేటాయించాలని నియోజకవర్గంలోని అన్ని మండలాల పాస్టర్లు కోరారు. క్రైస్తవులపై దాడులను అరికట్టడంతో పాటు క్రైస్తవ సమాజానికి న్యాయం జరుగాలంటే ఆనంద్‌కుమార్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలని అన్నారు. పట్టణంలోని బీసీ కాలని బెతస్తా ప్రధాన మందిరంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల పాస్టర్లు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రైస్తవులపై దాడులు, సువార్తను అడ్డుకుంటున్న మతోన్మాదుల గురించి పార్లమెంట్‌లో మాట్లాడేందుకు క్రైస్తవుడికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోజెస్, మార్టిన్ లూథర్, గడ్డం ప్రతాప్, ఇమ్మానియేల్, లాజరస్, మండల సెక్రటరీ బొచ్చు సల్మాన్, సంగెం కార్యదర్శి చంద్రశేఖర్, నడికూడ అధ్యక్షుడు జయరాజ్ పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



పాడె మోస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బాలసాని ప్రేమలీలకుమారస్వామి దంపతుల కూతురు పెరుమాండ్ల కోమల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం ఆమె అంత్యక్రియల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొని పాడె మోశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ ప్రజాప్రతినిధులు నవీన్‌కుమార్, లక్ష్మణ్‌రావు, రవీందర్‌రెడ్డితో పాటు హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న మాణిక్యరావు

ఐనవోలు : విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మానవతా విలువలను పాటించి ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోవాలని స్వచ్ఛంద సమాజికసేవా కార్యకర్త మాణిక్యరావు సూచించారు. మండలంలోని నందనం ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం సీఎస్ఆర్ మల్లిక్ అధ్యక్షతన మానవతా విలువలు, లక్ష్యాలు, సామాజిక అంశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. పెద్దలు చూపే మార్గంలో విద్యార్థులు పయనించాలని సూచించారు. గురువులను, తల్లితండ్రులను మరవకుండా వారిని ఎల్లవేళల గౌరవించాలని అన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని అందుకు తగిన విధంగా శ్రమించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మానవతా విలువలు పాటించి మహనీయులైన గాంధీ, అంబేడ్కర్, కలాం, నేతాజీ తదితరులను స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. చెడు మార్గానికి దూరంగా ఉండాలని, చదువుపై ఏకాగ్రత వహించాలని సూచించారు. కాగా గత 20 సంవత్సరాలుగా స్వచ్ఛంద సేవ చేస్తున్న మాణిక్యరావును పాఠశాల హెచ్ఎం తిరుపతిరావు రూ.2016, ఎస్జీటీ టీచర్ కొంతం జ్యోతి రూ.1016 బహూకరించి శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శివాలయ నిర్మాణ పనులు



శివాలయం పనులు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

దామెర : మండల కేంద్రంలో శివాలయ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం దర్వాజ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో శివాలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు చందుపట్ల సత్యవర్ధన్‌రెడ్డి, బిల్లా రమణారెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి, మేరుగు కుమార్, మిరియాల రవి, పెంట కొమురయ్య పాల్గొన్నారు.

'సఖి' సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీదేవి

ధర్మసాగర్ : సఖి కేంద్రం అందించే సేవలను బాధితులు వినియోగించుకోవాలని సఖి వన్‌స్టాప్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి కోరారు. మండలంలోని ధర్మపురంలో బుధవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సఖిసెంటర్ ముఖ్యఉద్దేశాలు, అందించనున్న సేవలను వివరించారు. చిన్నపిల్లలు లైంగిక వేధింపులకు గురికాకుండా ప్రభుత్వం చట్టం తీసుకువచ్చినట్లు తెలిపారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాఫ్ సెంటర్ కొనసాగుతున్నట్లు చెప్పారు. బాధిత మహిళలకు ఉచితంగా కౌన్సెలింగ్, న్యాయ, పోలీస్, వైద్య సహాయం, తాత్కాలిక వసతితోపాటు ఐదురకాల సేవలను అందిస్తున్నామని అన్నారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించి చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసేచోట వేధింపులు, అత్యాచారాలు, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి రక్షణ కల్పించేందుకు సఖిసెంటర్ సిబ్బంది 24 గంటలు పని చేస్తారని అన్నారు. మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని కోరారు. 0870-2452112, లేదా టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేస్‌వర్కర్‌లు వినీల, రుద్ర, సుశీల, శోభ, ఆశాలు సుభాషిణి, సఖి కేంద్రం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆయాలు సక్రమంగా విధులు నిర్వర్తించాలి



సాంబలక్ష్మిని సన్మానిస్తున్న సూపర్‌వైజర్

శాయంపేట : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆయాలు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయాలతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఉదయం 8.40 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలను, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అన్నారు. పిల్లల ఆరోగ్యంపై అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మండలంలోని పెద్దకోడెపాక మూడో అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న సాంబలక్ష్మిని ఉత్తమ ఆయాగా ఎంపిక చేసి ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 10,11వ తేదీల్లో రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడల కన్వీనర్ ఆరూరి సుమలత తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ధర్మప్రకాశ్‌తో కలిసి బుధవారం క్రీడల నిర్వహణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ.. క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

'రమాబాయి అంబేడ్కర్' కు ఘన నివాళి



శాయంపేట : రమాబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



ఆత్మకూరు : రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శాయంపేట : మండలంలోని పత్తిపాకలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం రమాబాయి అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు విజయ్‌ప్రకాశ్ రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతి అభివృద్ధి కోసం తన పిల్లలను త్యాగం చేసిన మహా త్యాగశీలి రమాబాయి అని కొనియాడారు. అంబేడ్కర్ ఉన్నత చదువుల కోసం విదేశాల్లో ఉన్నప్పుడు కుటుంబాన్ని తన బుజస్కందాలపైన వేసుకొని నడిపించిన రమాబాయిని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్, జిల్లా కార్యదర్శి నాలికే ప్రతాప్, బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు మగ్గం సుమన్, కార్యదర్శి నాలికే శ్రీకాంత్, నరేష్, సాయితిలక్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు అక్కంపేటలో బుధవారం రమబాయి అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, అలువాల రవి, పెండ్యాల భిక్షపతి, పొగాకుల రాజు, సునీల్‌కుమార్, రవీందర్ పాల్గొనగా అక్కంపేట ప్రాథమిక పాఠశాలలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో రమాబాయి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిలువేరు భిక్షపతి, ఉపేందర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న ఎస్సై దేవేందర్

శాయంపేట : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై దేవేందర్ సూచించారు. మండల కేంద్రానికి చెందిన 21మంది వాలీబాల్ క్రీడాకారులకు రూ. 10వేల విలువల గల టీషర్టులు, లోయర్లను పత్తిపాక గ్రామానికి చెందిన పెయింటింగ్ ఆర్టిస్టు గాజుల మొగిలి అందించగా ఎస్సై దేవేందర్ క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సన్మార్గంలో పయనిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం లభిస్తుందని అన్నారు. విద్యార్థులు చెడు స్నేహానికి, మార్గానికి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మంచి నడవడికను సాగించాలని సూచించారు. దాతల సహకారంతో క్రీడాకారులకు టీషర్టులు, లోయర్లు అందించిన మొగిలిని అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుమన్ క్షమాపణ చెప్పాలి

వేలేరు : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి సుమన్‌కు లేదన్నారు. స్థాయిని మరిచిపోయి విమర్శలు చేస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సలీమ్ మాలిక్, ప్రశాంత్, అనిల్, భరత్ పాల్గొన్నారు.

షిర్డీ యాత్రకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూరు : మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు బుధవారం షిర్డీ యాత్రకు వెళ్ళారు. పరకాల ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి విజయం సాధించిన సందర్భంగా మొక్కులు చెల్లించేందుకు వెళ్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రవీందర్ గౌడ్ తెలిపారు. . కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జయపాల్‌రెడ్డి, నాయకులు జలందర్‌రెడ్డి, రవి, మాజీ సర్పంచ్ సామెల్ ఉన్నారు.